*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక(18.02.87)*

# పన్నాలాల్‌గారి కథ

**మం**చి నిద్ర పోతుండగా పన్నాలాల్‌గారికి మెలకువ వచ్చింది. బయటనుంచి జనం గోల చేస్తున్న ధ్వని వినిపిస్తోంది.

"సేఠ్‌జీని పిలవండి!" అని చాలామంది ఏక కంఠంతో అరుస్తున్నారు.

"అయ్యగారు నిద్రపోతున్నారు" అని నౌకరొకడు గది బయట ఎవరితోనో అంటున్నాడు.

"ఆయన రాకపోతే జనమంతా లోపలికి వచ్చేస్తారు." అంటున్నాడు అవతల మనిషి.

పన్నాలాల్‌గారికి కంగారు పుట్టింది. చటుక్కున పక్కమీద నించి లేచాడు. గబగబా గది బయటికి వచ్చాడు. ఎవరా జనమని – ఏమిటా గోలని అడగటానిక్కూడా ఆయనకి భయంగా ఉంది.

గుమాస్తా గుమ్మంలోనే ఎదురొచ్చాడు. "అయ్యగారూ! అబ్బాయిగారు. అబ్బాయి గారు..." అని నీళ్ళు నమిలాడు.

'అబ్బాయి ఏం చేశాడ'ని అడగటానిక్కూడా ఆయనకి నోరు రాలేదు.

"సేఠ్‌జీని పిలవండి" మళ్ళీ బయటనించి కేక.

ఆశ్చర్యం! ఆ కేక వేసింది ఎవరో కాదు. సరాసరి సేఠ్‌జీ గారి కొడుకు. గజగజ వణుకుతున్న ఆయన కాళ్ళు ఎలాగో బయటికి నడిచాయి.

అక్కడ ఎంతోమంది జనం గొంతులు చించుకుంటున్నారు. నినాదాలు, బేనర్లు ఇంట్లోకి తోసుకురావటం ఒక్కటే తరువాయి.

"ఏమిటి? ఏం కావాలి మీకు?" అని గట్టిగా అడిగాడు పన్నాలాల్‌గారు.

ఆయన గొంతు ఆయనకే వినపడనంత బలహీనంగా ఉంది. ఆయన మాట వినపడక పోయినా ఏమిటి అడిగాడో అర్థమైనట్టు ఆయన కొడుకు ముందుకు వచ్చాడు. జనాన్ని ఆగమన్నాడు. జనం సద్దుమణిగారు.

పన్నాలాల్‌గారి అబ్బాయి తండ్రివైపు తిరిగాడు.

జనమంతా పన్నాలాల్‌గారి ఫ్యాక్టరీలో పనిచేసేవాళ్ళు. ఎంతోకాలంగా కష్టపడి ప్రొడక్షన్ పెంచుకుంటూ వచ్చారు. సేఠుగారికి లాభాలు బాగా ఆర్జించి పెట్టారు. కాని, వాళ్ళ కోసం ఆయన ఏమీ చేయలేదు. ఈ అన్యాయం ఇక నుంచి జరగటానికి వీలు లేదు. ఫ్యాక్టరీ అభి వృద్ధికి ఎవరైతే కారకులయ్యారో వారికి ఆ లాభాల్లో వాటా ఇవ్వాలి. ఇకముందు

పన్నాలాల్‌గారు, ఆయన కొడుకు అంతా కూడా ఫ్యాక్టరీలో పనిచేసే తక్కిన వాళ్ళతో సమానం. ప్రత్యేకంగా హోదాలుండవు. ఉండకూడదు!

ఈ మాటలు అంటున్నది సోషలిస్టులు కాదు. కమ్యూనిస్టులు కాదు. ఫ్యాక్టరీ వర్కర్సు కూడా కాదు. సరాసరి సేఠ్‌గారి సుపుత్రుడు అంటున్నాడు!

పన్నాలాల్‌గారికి మతిపోయినట్టయింది. కొన్నాళ్ళుగా ఒక సమస్యతోనే వేధించుకు తింటున్నాడనుకుంటుంటే ఇప్పుడు అర్థంతరంగా మరోటి లేవనెత్తాడు. పరస్పర విరుద్ధమైన బుద్ధులు వీడికెలా పుట్టాయి? లోకంలో ఇలాంటి వైపరీత్యం ఎక్కడైనా ఉంటుందా? ఎలాంటి కొడుకు ఎలాగైపోయాడు? ఎలాంటి మాటలంటున్నాడు?

తానెన్నో 'తిప్పలు' పడి డబ్బు సంపాదిస్తున్నాడు. తక్కువ జీతభత్యాలిచ్చి ఫ్యాక్టరీ వర్కర్సు కడుపులు కొడుతున్నాడు. ధరలు పెంచుకుంటూ పోతూ ప్రజల జేబులు కొడుతున్నాడు. బ్లాకులో సరుకులు అమ్మి టాక్సులు ఎగకొడుతున్నాడు. చిన్న కంపెనీలు పైకి రాకుండా వాటి సరుకులు తక్కువకి కొని మరోచోట ఎక్కువ ధరలకమ్మి వాళ్ళ నోళ్ళల్లో మట్టికొడు తున్నాడు. ఎన్ని మాయదారి పనులు చేస్తూ ఈ ఆస్తిని కూడ బెట్టగలుగుతున్నాడు?

తానింత 'కష్టపడి' సంపాదిస్తున్న డబ్బుని తన కొడుకేం చేస్తున్నాడు? వేలకి వేలు పట్టుకువెళ్ళి పిక్నిక్కులకి, పార్టీలకీ పాడుచేస్తున్నాడు. తాగుడికీ తందనాలకీ తగలపెడుతున్నాడు. డబ్బు ఇవ్వకపోతే అప్పులు చేస్తున్నాడు. ఆ తరువాత అప్పులవాళ్ళని ఇంటి మీదకి తోలేస్తున్నాడు. "ఏమిటిరా ఈ అఘాయిత్యపు పనులు" అంటే "మరి ఖుషీ చేయటానిక్కాకపోతే ఈ డబ్బంతా ఎందుకు నాన్నా?" అని ఎదురు ప్రశ్న వేస్తున్నాడు.

"సంపాదించడానికి నువ్వెలాగా ఉన్నావు. ఖర్చు పెట్టటానికి నాలాంటి వాడొకడుండద్దా?" అన్నాడు.

ఈ తప్పతాగుడు మాటలు, ఈ కులాసా ఖర్చులు లేకుండా కొడుకు కూడా తనలా సంపాదనపరుడై 'మంచిదారి'న పడేలా ఎలా చెయ్యాలా అని కొన్ని రోజులుగా ఆలోచిస్తున్నాడు పన్నాలాల్‌గారు. ఆయన ఆలోచనింకా తెగలేదు. ఈ సమస్యకింకా పరిష్కారం దొరకలేదు.

ఇంతలో హఠాత్తుగా ఏమొచ్చిందో, ఎవరు వాడి బుర్ర పాడుచేశారో, కొత్త పీడ తెచ్చి పెట్టాడు. సరికొత్త సమస్య నెత్తిన పెట్టాడు.

ఎప్పుడూ క్లబ్బుల్లో, కేబరే డాన్సుల్లో తప్ప ఫ్యాక్టరీలో అడుగుపెట్టిన వాడు కాదే! వీడియో పార్లర్లు, బ్లూ ఫిల్ములు చూడ్డం తప్ప వర్కర్ల జీవితాలెలా ఉంటాయో చూసినవాడు కాదే! గేంబ్లింగ్ టేబిల్సు మీద ఇంట్లోంచి తెచ్చిన వందలు విసరటం తెలుసునే కాని 'కూలి వెధవల' గురించి ఆలోచించటం తెలియని అమాయకుడే! అలాంటి తన కొడుక్కి ఒక్కసారిగా ఇలాంటి పెడబుద్ధులు ఎలా అబ్బాయి? పని వెధవల బ్రతుకుల గురించి ఆలోచించే అవసరం ఏమొచ్చింది? తను అడుగుతున్నదేమిటో తెలిసే అడుగుతున్నాడా? ఆ పనే చేస్తే తన గతి ఏమవుతుందో తెలిస్తే అలా అనగలడా? వాడెక్కిన కొమ్మని వాడే నరుక్కుంటున్నాడని వాడికర్థం

చెప్పటం ఎలా? తన ఒక్కగానొక్క కొడుక్కి ఎంత కర్మ పట్టింది?

"ఒరేయ్ మున్నా! లోపలికి రా, నీకో సంగతి చెప్పాలి." అని ఎలాగో గొంతు పెగుల్చుకొని అన్నాడు పన్నాలాల్‌గారు.

ఆయన కొడుకు తల అడ్డంగా తిప్పాడు. "వీల్లేదు. నన్ను ముద్దు చేయటానికి నేనిప్పుడు మీ మున్నాని కాదు. ఇక నుంచి ఫ్యాక్టరీ వర్కర్సులో నేనూ ఒకణ్ణి. వాళ్ళ కష్ట సుఖాలే నావి. వాళ్ళ లాభ నష్టాలే నావి. వాళ్ళకోసం నేనేమైనా చేస్తాను. ఈ నిమిషం నుంచి ఈ ఇంటికీ నాకూ ఎటువంటి సంబంధం లేదు...."

"అయ్యో! అలాగనకు మున్నా! ఎంతయినా నిన్ను కన్న తండ్రినిరా!" అని వాపోయాడు పన్నాలాల్‌గారు.

"నా మీద మీకలాంటి అభిమానమే ఉంటే వెంటనే ఫ్యాక్టరీ లాభాలన్నీ వర్కర్సుకి పంచి పెట్టండి. ఇక నుంచి మాతోపాటే మీరు కలిసి ఉండండి."

"సరే, ఆ సంగతే నీతో వివరంగా మాట్లాడాలి. ఎంత లాభాలున్నాయో, ఎలా ఎలా పంపకాలు చేయాలో ముందు మనం మాట్లాడుకోవాలి కదా! ముందొకసారి లోపలికి రా! ఆ తరువాత నువ్వెలాగంటే అలా!"

ఆయన కొడుకు జనంవైపు చూశాడు. అలాగే వెళ్ళమని జనం కేకలు పెట్టారు. పన్నాలాల్‌గారితోపాటు లోపలికి వచ్చాడు ఆయన కొడుకు. ఆయన చెప్పటం మొదలు పెట్టాడు.

"నా సంపాదనంతా ఎవరికోసం? నీ సుఖం కోసం కాదా? ఈ ఆస్తికి వారసుడివి నువ్వు. కావాలంటే ఈ క్షణంలో ఇదంతా నీ పేర రాసి నేనే తీర్థయాత్రలకో పోగలను. కాని, నువ్వంటున్నట్లు ఈ ఆస్తంతా వాళ్ళందరికీ పంచి పెట్టాశాననుకో! ఇక నీకేం మిగులుతుంది? ఇకనుంచి నువ్వెలా బతకాల్సి వస్తుందో తెలుసా? ఈ మహాభవనం ఉండదు. ఈ నౌకర్లు, చాకర్లు ఉండరు. డబ్బుకి కటకటలాడిపోతావు. డబ్బుకోసం పడరాని పాట్లు పడాల్సి వస్తుంది..."

"ఫర్వాలేదు. నాకూ రెక్కలున్నాయి. కష్టపడతాను. వాళ్ళలాగే నా కష్టార్జితంతో కలోగంజో తాగుతాను. నాకీ పాపపు సొమ్ము అక్కర్లేదు."

తండ్రి ప్రేమతో ప్రాధేయపడితే వినలేదు. భవిష్యత్తు గురించి భయపెడుతుంటే వినటం లేదు. ఇక వీడు 'మంచిదారి'న పడతాడన్న ఆశ ఎక్కడుంది? ఈ మూర్ఖుడి కోసం తన ఆస్తిని సర్వనాశనం చేసుకోవటానికి తనేమన్నా తెలివి తక్కువ వాడా?

"నయానా భయానా చెప్పాను. నువ్వు వినటం లేదు. ఇంతకు ముందు నాకూ నీకూ ఏమీ సంబంధం లేదని అన్నావు. ఆ మాట నేనే అంటానిప్పుడు. నా మాట వినకపోతే ఇకనుంచి నీకీ ఇంటితో సంబంధం ఉండదు. ఇదంతా నా ఆస్తి. నా సంపాదన. నా డబ్బు. ఇదెవరికో ధారాదత్తం చేస్తానంటే నేనొప్పుకోను..." అన్నాడు పన్నాలాల్‌గారు ఆవేశపడుతూ.

"ఒప్పుకోకపోతే ఒప్పిస్తాను...."

"ఏం? దౌర్జన్యం చేద్దామనుకుంటున్నావా? పోలీసుల్ని పిలుస్తాను."

"వాళ్ళు వచ్చేలోగా మా పని మేము కానిస్తాము. తాళం చెవులిలా ఇయ్యి..."

"నేనివ్వను..." లోపలి గదిలోకి పోవాలని చూస్తున్నాడు పన్నాలాల్‌గారు. తండ్రితో కలబడి తాళం చెవులు లాక్కోవాలని చూస్తున్నాడు కొడుకు.

తండ్రీ కొడుకుల మధ్య కుస్తీపట్లు మొదలయ్యాయి. కొడుకు వయసులో ఉన్నవాడు. బలమైన వాడు. ఏ క్షణంలోనైనా తాళం చెవులు వాడి పరమయ్యేలా ఉన్నాయి. పన్నాలాల్‌గారికి ప్రాణాలు కడట్టినట్టున్నాయి. ఎవరినైనా సాయం చెయ్యమని అరుస్తున్నాడు. ఇంట్లో నౌకర్లున్నారు. గుమాస్తా ఉన్నాడు. ఎవళ్ళూ వాళ్ళ మధ్యకి రావటం లేదు. ఎవ్వరూ వాళ్ళని విడదీయటం లేదు. ఆయన పట్లు విడిపోతున్నాయి. ఆయనకు ఆయువు పట్టు విడిపోతున్నట్టుగా ఉంది.

భయంతో బాధతో పిచ్చిగా కేక పెట్టాడు పన్నాలాల్‌గారు!

"..... అయ్యగారూ! అయ్యగారూ!" అని ఎవరో పిలవటం వినిపించింది. ఒంటిమీద ఎవరో తట్టి పిలిచినట్లైంది.

ఆయన గబుక్కున కళ్ళు తెరిచాడు.

ఎదురుగా ఆత్రంగా చూస్తున్నాడు వంటవాడు నాయరు. తను తన పడకగదిలో పక్కమీద పడుకుని ఉన్నాడు. ఆవరణలో ఫ్యాక్టరీ వర్కర్లు అరుస్తున్న అలికిడి ఎక్కడా లేదు. ఆ గదిలో తన కొడుకూ లేడు. గబుక్కున తాళం చెవుల కోసం తడుముకున్నాడు. అవి తలగడ కింద భద్రంగా ఉన్నాయి!

అంటే?

"ఏమిటి బాబూ! కలేమైనా వచ్చిందా?" అని అడిగాడు నాయరు.

"అవున్రా! పీడకల"

నాయరు నవ్వాడు. "అలాంటి కలలు నిజం కావు బాబుగారూ!"

పన్నాలాల్‌గారికి గుండెలమీది భారం తగ్గిపోయినట్టనిపించింది.

"మున్నా ఏడీ?" అని ఆత్రంగా అడిగాడు.

"ఇప్పుడే టిఫిను తిన్నారు బాబూ!"

ఆయన ఇంకా ఏదో అడగబోతుంటే ఆయన సుపుత్రుడి గొంతు బయటి గదిలో వినిపించింది.

".... అర్జంటుగా వెయ్యి రూపాయలు కావాలోయ్!" గుమాస్తాని అడుగుతున్నాడు.

"కొంచెం అయ్యగారితో చెప్పి...."

"ఇచ్చాక చెప్పకూడదేమిటి?" అని విసుక్కున్నాడు మున్నాగారు.

"అయ్యగారు.... అయ్యగారు..."

"ఏమిటోయ్ అయ్యగారు? చెప్పలేక చస్తున్నావేమిటి?"

"అయ్యగారికి చెప్పకుండా మీకు డబ్బులివ్వద్దని చెప్పారు బాబూ!...." గుమాస్తా గొంతు భయం భయంగా వినిపించింది.

మరుక్షణంలో 'మున్నా'గారేం చేసేవాడో కాని గుమాస్తాని గట్టిగా కేకపెట్టి లోపలికి పిలిచాడు పన్నాలాల్‌గారు. గుమాస్తా లోపలికి వచ్చి "చిన బాబుగారు..." అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు.

"మున్నాకెంత డబ్బు కావాలంటే అంతా ఇయ్యి!"

గుమాస్తా గుడ్లు మిటకరించాడు.

"అయ్యగారూ?"

"అవును. ఇక నుంచి నాతో చెప్పనక్కర్లేదు."

గుమాస్తా మతిపోయినట్లు చూశాడు. నిన్ననలా చెప్పారు. ఇవేళ ఇలా చెపుతున్నారేమిటి? నిద్ర బద్ధకంలో పరాకు మాటలు కాదు కదా!

"వినపడిందా? వాడికి కావలసింది ఇచ్చి పంపు" అని తన కొడుక్కి వినపడేలా మళ్ళీ గట్టిగానే చెప్పాడు పన్నాలాల్‌గారు.

గొప్పవారి మనసులు ఎప్పుడెలా ఉంటాయో ఎవరు చెప్పగలరు! గాఢంగా నిట్టూర్చి తల ఊపి వెళ్ళిపోయాడు గుమాస్తా.

పన్నాలాల్‌గారికి ఇంతకు ముందు వచ్చిన మెలకువ కలలో! ఇపుడు వాస్తవంలో పూర్తిగా మెలకువ వచ్చింది. అబ్బ, ఎలాంటి విచిత్రమైన కల! తన 'మున్నా' ఏమిటి, యూనియన్ వర్కర్సుతో కలిసిపోవటమేమిటి? అలాంటి కల వచ్చినందుకు పన్నాలాల్‌గారికి నవ్వొచ్చింది.

అంతలోనే 'ఒక్కోప్పుడు కలలు నిజమవుతాయంటారు. ఇది జరగనున్నది కాదు కదా' అని అనిపించి ఆయన గుండె జల్లుమంది. ఛ! ఇప్పుడేగా 'మున్నా' డబ్బు పట్టుకు వెళ్ళిపోయాడు. వాడేమిటి, వర్కర్సుతో కలవటమేమిటి?

మరైతే, ఇలాంటి పీడకల ఎందుకు వచ్చి ఉంటుంది? ఆయనకి గత దినం జరిగిన సంగతులు గుర్తుకు వచ్చాయి.

ఫ్యాక్టరీలో యూనియన్ వాళ్ళు బోనస్ కావాలని నినాదాలు చేశారు. వాళ్ళతో వాదులాడి ఇంటికి వచ్చేసరికి అబ్బాయి చేసిన అప్పులు తీర్చమంటూ అప్పులవాళ్ళు సిద్ధమయ్యారు. ఈ గొడవలతో మనసు కుదురు లేక తను కాస్త 'మందు' పట్టించి పడుకున్నారు. బహుశా కలత నిద్రలో అవీ ఇవీ కలిసి అలాంటి పీడకల కింద వచ్చి ఉంటుంది.

అమ్మయ్య! అదేదీ నిజం కాదు. తనేం భయపడనక్కర్లేదు. తన 'మున్నా' బుర్రని ఎవ్వరూ పాడుచేయలేదు. వాడెప్పటిలా 'బుద్ధిమంతుడు'గానే ఉన్నాడు.

పన్నాలాల్‌గారు కులాసాగా నవ్వుకుంటూ వంటవాడు తెచ్చిన బెడ్ టీ అందుకున్నాడు.

•